# హరితహారానికి సన్నద్ధం

- గ్రామాలకు లక్ష్యం కేటాయింపు
- నర్సరీల్లో పనులు ప్రారంభం
- పర్యవేక్షిస్తున్న అధికారులు

బీబీపేట్, డిసెంబర్ 16 : జీవకోటికి ప్రాణాధారమైన చెట్లును నరికివేస్తుండడంతో పర్యావరణానికి, మానవాళికి ముప్పుదాపురించింది. ఇప్పుటికే జరగాల్సిన నష్టం జరిగిపోగా, మున్ముందు కలిగే నష్టాన్ని దృష్టిలో ఉంచుకొని వాటిని ఆరికట్టేందుకు అధికారులు మొక్కలను పెంచి వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు నడుంబిగించారు.

**నర్సరీల్లో బ్యాగ్ ఫిల్లింగ్ పనులు పూర్తి..**

హరితహారంలో భాగంగా బీబీపేట మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో 82,000 మొక్కలను నాటాలనే ఉద్దేశంతో ప్రతి గ్రామంలో నర్సరీలను ఏర్పాటు చేసి బ్యాగ్ ఫిల్లింగ్ పనులను పూర్తి చేశారు. ప్రజలకు అవసరమయ్యే సీడ్స్ నాటాలని ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్ ఆయా గ్రామాల ప్రంచాయతీ కార్యదర్శులకు సూచించారు. బీబీపేటలో నర్సరీల్లో 8 వేలు, ఇస్సానగర్ నర్సరీల్లో 7 వేలు, జనగామ నర్సరీలో 8 వేలు, కోనాపూర్ నర్సరీలో 7 వేలు, మాల్కాపూర్ నర్సరీలో 8 వేలు, మాందాపూర్ నర్సరీలో 8 వేలు, శేరీ బీబీపేట నర్సరీలో 6 వేలు, రాంరెడ్డిపల్లి నర్సరీలో 7 వేలు, ఉప్పుర్‌పల్లి నర్సరీలో 7 వేలు, తుజాల్‌పూర్ నర్సరీలో 8 వేలు, యాడారం నర్సరీలో 8 వేలు నూతంగా ఏర్పాటు చేసిన నర్సరీలో బ్యాగ్ ఫిల్లింగ్ పనులను పూర్తి చేసి సీడ్స్ నాటారు. ప్రతిరోజూ ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో వన సేవకులతో పంచాయతీ కార్యదర్శులు నీళ్లు పట్టిస్తున్నారు.




మాందాపూర్‌లో ఏర్పాటు చేసిన నర్సరీ

**లక్షా పది వేల మొక్కలు నాటడమే లక్ష్యం**

బీబీపేటతోపాటు అన్ని గ్రామాల్లో నర్సరీలో 82 వేల మొక్కల పెంపకానికి ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్, ఏపీవో రజిని, పంచాయతీ కార్యదర్శులు కలిసి ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. అన్ని గ్రామాల్లో బ్యాగ్ ఫిల్లింగ్‌ను పూర్తి చేసి గతంలో మిగిలిన మొక్కలతోపాటు కొత్త మొక్కలు కలిపి ప్రతి గ్రామంలో 10 వేల మొక్కలు నాటాడమే లక్ష్యంగా ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. వాన కాలం వరకు మొక్కలు అందుబాటులో ఉండేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. బ్యాగ్ ఫిల్లింగ్ పనులు పూర్తి కావడంతో ప్రజలకు అవసరమయ్యే విత్తనాలు బ్యాగుల్లో నాటడం, వాటరింగ్ పనులు వారం రోజుల్లో ప్రారంభిస్తామని మండలంలోని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తెలిపారు.



బీబీపేట నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్(ఫైల్)

### మొక్కలు ఎండిపోకుండా చూసుకుంటున్నారు



గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో పెంచిన మొక్కలు ఎండిపోకుండా ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు చూసుకుంటున్నారు. మండలంలో మొత్తం కొత్తవి, పాత మొక్కలు కలిసి లక్షా పది వేల మొక్కలు నాటాలనే ఉద్దేశంతో ప్రణాళికను సిద్ధం చేశాం. గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలో బ్యాగ్ ఫిల్లింగ్ పనులను పూర్తి చేశాం. వారంలో విత్తనాలు బ్యాగుల్లో నాటడం, వాటరింగ్ పనులకు వన సేవకులను సిద్ధం చేశాం.

**- పూర్ణచంద్రోదయకుమార్, ఎంపీడీవో**

## నర్సరీలో మొక్కల పెంపకానికి చర్యలు



బోర్లంలోని నర్సరీలో మట్టి బెడ్లు సిద్ధం చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

బాన్సువాడ రూరల్, డిసెంబర్ 16 : ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామాల్లో మొక్కలు నాటించేందుకు నర్సరీల్లో మొక్కల పెంపకానికి అధికారులు చర్యలు చేపట్టారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో పూల మొక్కలతోపాటు పండ్ల మొక్కల పెంపకానికి కవర్లలో మట్టి నింపి బెడ్లు సిద్ధం చేస్తున్నారు. బోర్లం క్యాంపు, జక్కల్‌దాని తండా, కోనాపూర్, తాడ్కోల్, దేశాయిపేట్ గ్రామాల్లోని నర్సరీల్లో ఉపాధి హామీ కూలీలు కవర్లలో మట్టిని నింపే పనులు చేస్తున్నారు. వచ్చే జూన్ నాటికి మొక్కలు నాటేందుకు నర్సరీల్లో మొక్కలు సిద్ధం చేస్తున్నట్లు ఏపీవో మల్లేశ్ తెలిపారు.

**నర్సరీని పరిశీలించిన ఎంపీడీవో**

రాజంపేట్, డిసెంబర్ 16 : రాజంపేట మండలం ఆర్గొండ గ్రామంలోని నర్సరీని ఎంపీడీవో బాలకిషన్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మొక్కల పెంపకం కోసం బెడ్‌లను సిద్ధంగా ఉంచాలన్నారు. మొక్కలకు ప్రతి రోజూ నీరు పట్టడానికి సరైన ఏర్పాట్లు చేసుకోవాలని, నర్సరీ చుట్టూ పూర్తి స్థాయిలో పెన్సింగ్ ఏర్పాటు చేయాలని సంబంధిత పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాలకిషన్, ఎంపీవో రఘురాం, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్ పాల్గొన్నారు.

## రైతు బంధుకు దరఖాస్తు చేసుకోవాలి

బీబీపేట్, డిసెంబర్ 16 : కొత్తగా పట్టా పాస్ బుక్ వచ్చిన రైతులు యాసంగి 2023–24 రైతు బంధు కోసం ఆయా గ్రామాల్లోని రైతు వేదికలో దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ విస్తరణాధికారి రాఘవేంద్ర శనివారం రైతులకు సూచించారు. పట్టా పాస్ బుక్, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా జిరాక్స్ తీసువచ్చి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

## లిటిల్ స్కాలర్స్ పాఠశాలకు అవార్డు



అవార్డు తీసుకుంటున్న లిటిల్ స్కాలర్స్ పాఠశాల కరస్పాండెంట్ పున్న రాజేశ

కామారెడ్డి, డిసెంబర్ 16 : పట్టణంలోని లిటిల్ స్కాలర్స్ హైస్కూల్‌కు జాతీయ స్థాయి బ్రెయిన్‌ఫీడ్ స్కూల్ ఎక్సలెన్స్ అవార్డు వచ్చింది. హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్‌లో శనివారం జరిగిన జాతీయ సదస్సులో అవార్డును అందుకున్నారు. జాతీయ స్థాయిలో టాప్ 500 పాఠశాలలను ఎంపిక చేయగా వాటిలో కామారెడ్డికి చెందిన లిటిల్ స్కాలర్స్ పాఠశాలకు స్థానం దక్కింది. అత్యుత్తమ విద్యా ప్రమాణాలు, ఆధునిక సాంకేతిక బోధనలను ప్రామాణికంగా తీసుకొని ఈ అవార్డుకు ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ పున్న రాజేశ్ తెలిపారు. ఈ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు.

## యోగా శిక్షణ తరగతులు ప్రారంభం



పాల్గొన్న యోగా సభ్యులు

కామారెడ్డి, డిసెంబర్ 16 : కామారెడ్డి జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగా శిక్షణ తరగతులు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షుడు రాంరెడ్డి మాట్లాడుతూ.. సమాజానికి యోగా ప్రాముఖ్యత, యోగా నియమాలు, సాధకులు ఆచరించాల్సిన విధులు అనే అంశంపైన చర్చించనున్నట్లు తెలిపారు. శిక్షణ ఉదయం 6 నుంచి 7 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యోగా గురువులు గరిపల్లి అంజయ్య గుప్తా, అంతిరెడ్డి, ఎళ్లంకి సుదర్శన్, రఘుకుమార్, రాంచంద్రం, అంజయ్య, గంగారెడ్డి, గురుచరణం, అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



మాట్లాడుతున్న అశ్విని శ్రీవాత్సవ్

కామారెడ్డి రూరల్ , డిసెంబర్ 16 : వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ఈ నెల 16 నుంచి జనవరి 26వ తేదీ వరకు కొనసాగుతుందని భారత ప్రభుత్వ జాయింట్ సెక్రటరీ అశ్విని శ్రీవాత్సవ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డిలో ఏడు ప్రచార వాహనాలను ప్రధాని వర్చువల్‌గా ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ రత్నాబాయి, లీడ్ బ్యాంక్ అధికారి భార్గవ్ కుమార్, జడ్పీ సీఈవో సాయాగౌడ్, డీఎంహెచ్‌వో లక్ష్మన్‌సింగ్, పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు, పౌర సరఫరాల మేనేజర్ అభిషేక్ సింగ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## టెక్నికల్ కోర్సుకు దరఖాస్తు చేసుకోవాలి

కామారెడ్డి, డిసెంబర్ 16 : టెక్నికల్ కోర్సులో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు ఫిబ్రవరి 2024 డ్రాయింగ్ లోయర్ గ్రేడ్, హయ్యర్ గ్రేడ్, టైలరింగ్ అండ్ ఎంబ్రాయిడరీలో లోయర్ గ్రేడ్, హయ్యర్ గ్రేడ్‌కు సంబంధించిన పరీక్ష రుసుము తేదీలను ప్రకటించిందని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే వారి కనీస అర్హత 7వ తరగతి ఉత్తీర్ణులైన ఉండాలని తెలిపారు. అభ్యర్థులు www.bse.telangana.gov.in ద్వారా గవర్నమెంట్ ట్రెసరరీ చలాన్ హెడ్ ఆఫ్ అకౌంట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. డ్రాయింగ్ (లోయర్ గ్రేడ్) పరీక్ష రుసుము రూ.100, డ్రాయింగ్ (హయ్యర్ గ్రేడ్) రూ.150, టైలరింగ్ అండ్ ఎంబ్రాయిడరీ (లోయర్ గ్రేడ్) రూ.150, టైలరింగ్ అండ్ ఎంబ్రాయిడరీకి (హయ్యర్ గ్రేడ్) రూ.200 తెలిపారు. ఈ నెల 29వ తేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా చెల్లించవచ్చని తెలిపారు. రూ.50 అవపరాధ రుసుముతో ఈ నెల 30 నుంచి జనవరి 5వ తేదీ వరకు, రూ.75 అపరాధ రుసుముతో జనవరి 6 నుంచి 12వ తేదీ వరకు చెల్లించాలని సూచింవచారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు సంబంధిత పత్రాలు జత పరిచి జనవరి 13వ తేదీ లోగా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

## క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి

**కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి**

కామారెడ్డి, డిసెంబర్ 16 : క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి హాకీ క్రీడాపోటీలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను నిర్వహించడానికి విద్యాశాఖ, ఎస్‌జీఎఫ్, వ్యాయామ ఉపాధ్యాయులు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. జిల్లా క్రీడాకారులు, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి క్రీడా కోటాలో ఉద్యోగాలు సాధించాలని చెప్పారు. కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి హాకీ క్రీడా పోటీలు కామారెడ్డిలో నిర్వహించడానికి అధికారులు అన్ని రకాల సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో హాకీ పోటీల్లో రాణించాలని పేర్కొన్నారు. పది ఉమ్మడి జిల్లాలకు చెందిన 405 మంది క్రీడాకారులు ఈ టోర్నమెంట్లో పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రంలో డీఈవో రాజు, జిల్లా యువజన, క్రీడల సంక్షేమ అధికారి దామోదర్‌రెడ్డి, కౌన్సిలర్లు నరేందర్, శ్రీకాంత్, శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి



హాజరైన క్రీడాకారులు